క్లుప్తంగా

దరఖాస్తు చేసుకోవాలి

సిరిసిల్ల కల్చరల్/తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి ప్రభుత్వ ఐటీఐలో నాలుగో విడత అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.కవిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో ఫిట్టర్, మెకానిక్ డీజిల్, మెకానిక్ మోటార్ వెహికల్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, ఫ్యాషన్ డీజైన్ అండ్ టెక్నాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 30లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ప్రభుత్వ ఐటీఐ మండెపల్లిలో సంప్రదించాలన్నారు.

జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

సిరిసిల్ల అర్బన్: జర్నలిస్టుల భద్రత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం తీసుకురావాలని టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్ వద్ద టీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లాలో జర్నలిస్టులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని కోరుతూ నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. వృత్తిలో భాగంగా జర్నలిస్టులు కవరేజ్‌కు వెళ్లిన వారిపై కేసులు నమోదు చేయడం అప్రజాస్వామికమన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సామల గట్టు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ అ జీమ్, ప్రెస్‌క్లబ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

సిరిసిల్లటౌన్: పట్టణ శివారులోని చిన్నబోనాలలో సోమవారం కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. 200 మందికి ఆస్పత్రి జనరల్ ఫిజీషియన్ డాక్టర్ లోకేష్ బీరకాయల వైద్య పరీక్షలు చేశారు. ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, ముదిరాజ్ సంఘం బాధ్యులు దండు బాబు, లచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ పోరాటాన్ని వక్రీకరించొద్దు

సిరిసిల్లటౌన్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాలను వక్రీకరిస్తే రజాకార్లకు పట్టిన గతే పడుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ అన్నారు. సోమవారం పట్టణంలోని కార్మిక భవనంలో సాయుధ పోరాటాల వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. జిల్లాకేంద్రంలో కామ్రేడ్ బద్దం ఎల్లారెడ్డి, సింగిరెడ్డి భూపతిరెడ్డి కాంస్య విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరారు. లక్ష్మీపూర్ నుంచి సిరిసిల్ల వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యవర్గ సభ్యులు కడారి రాములు, సోమ నాగరాజు, మీసం లక్ష్మణ్, మంగ అనిల్, శాంత, గాజుల లింగము, కొంక విజయ్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



ఇల్లంతకుంట: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంపీడీవో శశికళ అన్నారు. ఇల్లంతకుంట, కందికట్కూర్ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలలను సోమవారం తనిఖీ చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు బోధన తీరును పరిశీలించారు. ఎంఈవో చెప్యాల శ్రీనివాస్ గౌడ్, హెచ్ఎం. ప్రేమలత, లక్ష్మీనారాయణ, మహేశ్‌చంద్ర, రమణారెడ్డి, కార్యదర్శులు తదితరులున్నారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న ఏపీఎం నర్సయ్య

ఎల్లారెడ్డిపేట: గ్రామాల్లోని మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఏపీఎం నర్సయ్య అన్నారు. మండలకేంద్రంలోని కావేరి మహిళా సమాఖ్య కార్యాలయంలో సోమవారం మండలంలోని పలు గ్రామాల సంఘాల సభ్యులతో ఆర్థిక లావాదేవీలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జయ్ హన్మాన్ గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు, సీసీలు, సీఆర్పీఎస్, వీవోసభ్యులు పాల్గొన్నారు.

దర్గా ఎందుకు తొలగించరు ?

వేములవాడ : రాజన్న ఆలయ విస్తరణపై అధికార యంత్రాంగం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించిన అనంతరం ఎప్పుడు పనులు మొదలుపెడతారనేది స్పష్టంగా తెలపడం లేదని, హిందూ దేవతా విగ్రహాలను తొలగిస్తున్నప్పుడు మరి దర్గా సంగతేంటని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అధికారులను అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆలయాన్ని ఎప్పుడు మూసేస్తారు, ఎన్నిరోజుల్లో పనులు పూర్తిచేస్తారో స్పష్టతలేదనీ, కూల్చివేతలు ప్రారంభించి మధ్యలో పనులు నిలిచిపోతే సుమారు నాలుగు వేలమంది ఉపాధి కోల్పోయి ఆ కుటుంబాలు వీధిన పడతాయన్నారు.

ఏళ్లుగా అసంపూర్తిగానే..

- మధ్యలోనే నిలిచిన మటన్ మార్కెట్ పనులు
- ముళ్ల పొదలతో నిండిన ఆవరణ
- ప్రధాన రహదారిపైనే మటన్ దుకాణాలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



ఎల్లారెడ్డిపేటలో ముళ్ల పొదలతో మటన్ దుకాణాల ఆవరణ

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని మటన్ దుకాణాల సముదాయం కోసం ప్రభుత్వం నిర్మించనున్న స్టాల్స్ నిధులు లేమితో పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. దీంతో నిర్మాణంలో ఉన్న ఆవరణ ప్రస్తుతం ముళ్ల పొదలతో నిండిపోయింది. బైపాస్‌లోని ప్రధాన రహదారిపైనే మటన్ దుకాణాలు ఉండడంతో రోడ్డుపై వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతోంది. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. రోడ్డుకిరువైపులా మటన్ దుకాణాలు ఉండటంతో ఆదివారం ఆ దారిగుండా వాహనాలు వెళ్లడం ఇబ్బందిగా మారింది. రోడ్డు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి.

జనాభాను దృష్టిలో పెట్టుకొని

ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంతో పాటు సమీప గ్రామాల్లో పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని గిద్దె చెరువు ప్రాంతంలో మటన్ స్టాల్స్ నిర్మించాలని 2020–21లో అప్పటి గ్రామ పంచాయతీ పాలకవర్గం తీర్మానించింది. పంచాయతీ, ఉపాధిహామీ భాగస్వామ్యంతో రూ.15 లక్షలతో స్టాల్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ పనులను ఇద్దరు కాంట్రాక్టర్లు కొంతవరకు నిర్మాణం చేపట్టగా, బిల్లులు రాకపోవడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. బిల్లులు మంజూరు చేయాలని పలుసార్లు కాంట్రాక్టర్లు పంచాయతీ, ఈజీఎస్ అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. దీంతో కాంట్రాక్టర్లు మధ్యలోనే పనులు వదిలేసి చేతులు దులుపుకున్నారు.

ముళ్ల పొదలతో ఆవరణ

మటన్ మార్కెట్ నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో ఆవరణ నేడు ముళ్ల పొదలతో దర్శనమిస్తోంది. ప్రస్తుతం మటన్ షెడ్డు గురించి పట్టించుకునేవారు కరువయ్యారు. దీంతో కొందరు వారి మేకలకు షెడ్డుగా మార్కెట్ ఆవరణను వాడుకోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మటన్ దుకాణాలకు ప్రత్యేక మార్కెట్ లేకపోవడంతో రోడ్డుపైనే నిర్వహించడంతో సమీప కాలనీవాసులు, వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మటన్ మార్కెట్ స్టాల్స్ నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



బైపాస్‌లోని ప్రధాన రహదారిపై మటన్ దుకాణాలు నిర్వహించడంతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. మటన్ స్టాల్స్ కోసం కేటాయించిన ప్రత్యేక స్థలంలో వెంటనే నిర్మాణ పనులు పూర్తిచేయాలి. కనీస సౌకర్యాలు లేకుండా రోడ్డుపైనే నిల్చొని మటన్ కొనుగోలు చేస్తున్న సందర్భాల్లో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

– భూక్య రాజేశ్, రాజన్నపేట

అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేయాలి



గిద్దె చెరువు ప్రాంతంలో అన్ని సౌకర్యాలతో మటన్ స్టాల్స్ ఏర్పాటు చేయాలి. రోడ్డుపై మటన్ విక్రయాలు కొనసాగించడం ఇబ్బందిగా ఉంది. తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న డబ్బాల్లో గంటల తరబడి కూర్చొని మటన్ అమ్ముకుంటున్నాం. చీకటి అయితే మటన్ విక్రయించేందుకు వీలుకావడం లేదు. వర్షాకాలంలో తడుస్తూ వ్యాపారం చేస్తున్నాం.

– సాయికుమార్, మటన్ వ్యాపారి, ఎల్లారెడ్డిపేట

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సిద్ధిరాములు

గంభీరావుపేట: తెలంగాణ బహుజన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర రెండో మహాసభలను విజయవంతం చేయాలని ఆశాఖ రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధిరాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు కోరారు. మండలకేంద్రంలో సోమవారం సభలకు సంబంధించిన ప్రచార పోస్టర్లను విడుదల చేశారు. అక్టోబర్ 11, 12 తేదీల్లో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సయ్యద్, బాల్ లక్ష్మీ, రేణుక, లక్ష్మీ, వరలక్ష్మీ, సంగీత, జ్యోతి, పద్మ, దేవవ్వ తదితరులు పాల్గొన్నారు.

చెరువు కెనాల్ పరిశీలన



కెనాల్‌ను పరిశీలిస్తున్న డీఈఈ రవికుమార్

ముస్తాబాద్: మండలకేంద్రంలో పెద్ద చెరువు కెనాల్ మరమ్మతు పనులను నీటి పారుదలశాఖ డీఈఈ రవికుమార్ సోమవారం పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలతో పెద్ద చెరువుకు వరదనీరు చేరిందని, కెనాల్ ద్వారా నీరు బయటకు వస్తుందన్నారు. రైతులకు సాగు నీరందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రోడ్డు విస్తరణ పనులతో ఇరిగేషన్ కెనాల్ దెబ్బతిందన్నారు. చెరువుల్లో నీరు చేరిందని, ఆయకట్టుకు నీరందించే పనులకు అందరూ సహకరించాలని కోరారు. ఏఈఈలు నవీన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు తదితరులున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై నిర్లక్ష్యం



మాట్లాడుతున్న కంచర్ల రవిగౌడ్

సిరిసిల్లటౌన్: ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై నిర్లక్ష్యం చూపుతుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 13లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో ఉందని, కళాశాలలు బంద్ చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఫీజుల కోసం కాలేజీల యాజమాన్యం బంద్‌కు పిలుపునిచ్చినా సర్కార్ స్పందించడం లేదన్నారు. వెంటనే పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు ప్రభుత్వం బకాయిలు విడుదల చేయాలన్నారు. నాయకులు ఎస్కే అప్రోచ్, కోడం వెంకటేశం, శివరాజ్, శ్రీనివాస్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు,

కరాటే పోటీల్లో ప్రతిభ



వేములవాడ: రేకుర్తిలో షూటో రాయ్ కరాటే ఇంటర్నేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సౌత్ ఇండియా ఓపెన్ చాంపియన్ షిప్ –2025 కరాటే పోటీల్లో వేములవాడ ఒకినావ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు ప్రతిభ కనబర్చి పతకాలు సాధించినట్లు మాస్టర్ ఎంఏ మన్నాన్ సోమవారం తెలిపారు. మొత్తం 60 మంది క్రీడాకారులు పాల్గొని పతకాలు సాధించారు. కరాటే ఇన్‌స్ట్రక్టర్లు తిరుపతి, అర్జున్ సింగ్, సీహెచ్ సూర్య జయచంద్ర ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

వేములవాడరూరల్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సైబర్ వారియర్ కానిస్టేబుల్ రాజశేఖర్ అన్నారు. చెక్కపల్లి ప్రభుత్వ పాఠశాలలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మండల విద్యాధికారికిషన్, విద్యార్థులు పాల్గొన్నారు.

గండిని పూడ్చిన రైతులు



ఇల్లంతకుంట: మండలంలోని తాళ్లపల్లి, గూడెం, గ్రామాల మధ్యలో ఉన్న అంపు ఒర్రె గండి పడటంతో తాళ్లపల్లి రైతులు సోమవారం స్వచ్ఛందంగా మట్టిపోసి గండిని పూడ్చారు. నెలరోజుల వర్షాలకు ఒర్రె గండిపడి రాకపోకలు నిలిచిపోయాయి. సోమవారం జేసీబీ, ట్రాక్టర్లతో మొరంపోసి మరమ్మతు చేశారు. రైతులు రామస్వామి, రాజిరెడ్డి, వెంకట్రెడ్డి, కిరణ్ రెడ్డి, కిట్టు, సదయ్య, నరసయ్య, అంజయ్య, కిషన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన



వేములవాడరూరల్: మండలంలోని నూకలమర్రిలో ఇందిరమ్మ ఇళ్లను హౌజింగ్ డీఈ కాజా ముజఫరుద్దీన్ సోమవారం పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల పనుల పురోగతి, నాణ్యత తదితర వాటిని పరిశీలించారు. ఆయన వెంట ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు వకుళాభరణం శ్రీనివాస్, పంచాయతీ సెక్రెటరీ రమ, లబ్ధిదారులున్నారు.

సంక్షిప్త వార్తలు

• పీసీసీ చీఫ్‌ను కలిసిన విప్

వేములవాడ: పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్ గౌడ్ బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని ఆయన నివాసంలో విప్ ఆది శ్రీనివాస్ సోమవారం కలిశారు. అనంతరం శుభాకాంక్షలు తెలిపారు.

• పోస్టర్ ఆవిష్కరణ

ఎల్లారెడ్డిపేట: ఈనెల 19, 20, 21 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించే ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్‌ను కలెక్టర్ సందీప్‌కుమార్ సోమవారం ఆవిష్కరించారు. సంఘం కార్యదర్శి ముత్యాల ప్రభాకర్ రెడ్డి, మండల అధ్యక్షుడు ఎండీ అజీముద్దీన్ మాట్లాడారు. తిరుపతి, మహమ్మద్ షాదుల్, మారోజు కుబేరస్వామి, షాడా శేఖర్‌రెడ్డి, పాల్గొన్నారు.

కోనరావుపేట: హైదరాబాద్‌లో జరిగే ఫొటో గ్రాఫర్ల సదస్సు పోస్టర్‌ను ఎస్సై ప్రశాంత్‌రెడ్డి ఆవిష్కరించారు. తెలంగాణ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 19, 20, 21 తేదీల్లో సదస్సు నిర్వహిస్తున్నారన్నారు. మండలంలోని అన్ని గ్రామాల ఫొటో, వీడియోగ్రాఫర్లు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షుడు సుంకటి అశోక్, కిరణ్, మంచికట్ల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

• హిందీ భాషా దినోత్సవం

ముస్తాబాద్: ముస్తాబాద్, బందనకల్, ఆవునూర్, నామాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో హిందీ భాషా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. హిందీ భాషా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు హిందీలో ఉపన్యాసం, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో రాజిరెడ్డి, హెచ్ఎంలు రాజ్‌మోహన్, రాధాకిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

• నివాళి

కోనరావుపేట: మల్కపేటలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు సోమవారం నిర్వహించారు. వారోత్సవాల్లో భాగంగా ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద పోరాట యోధుడు కర్రోల్ల నర్సయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి మూషం రమేశ్ మాట్లాడారు. జవ్వాజి విమల, సూరం పద్మ, మానస, సౌజన్య, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

• బేటీ బచావో బేటీ పడావోపై అవగాహన

తంగళ్లపల్లి: మండలంలోని లక్ష్మీపూర్‌లో తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ క్యాంపు సోమవారంతో మూడవ రోజు కొనసాగింది. బేటీ బచావో బేటీ పడావోపై అవగాహన కల్పించి ఆడపిల్లలకు చదువు ప్రాముఖ్యతను వివరించారు. ఏఎంసీ డైరెక్టర్ బాలు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వాణిశ్రీ, హెచ్ఎం రాజేశ్వరి, అధ్యాపకులు విద్యార్థినులు పాల్గొన్నారు.

• విద్యుత్ అంతరాయంతో ఇక్కట్లు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలో ముందస్తు సమాచారం లేకుండా సెస్ అధికారులు విద్యుత్ నిలిపివేశారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరా లేక చిరు వ్యాపారులు, వ్యాపారస్తులు, రైతులు ఇబ్బంది పడ్డారు. సెస్ అధికారులకు ఎలాంటి సమాచారం లేకుండా స్థానిక పంచాయతీ అధికారులు సాయిబాబా ఆలయం సమీపంలో చెట్లు కొమ్మలు తొలగించడంతో ప్రజలకు కష్టాలు తప్పలేదు.

• పుస్తకాలు పంపిణీ

గంభీరావుపేట: మండలకేంద్రంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో చదివే విద్యార్థులకు నేషన్స్ ఫస్ట్ హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధి అక్షిత భూక్య ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ ప్రిపరేషన్ బుక్స్, పాలీసెట్‌గైడ్స్, పాకెట్ డిక్షనరీ, అబ్దుల్‌కలాం మోటివేషన్ బుక్స్ అందించారు.

• 17న విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

ఎల్లారెడ్డిపేట: ఈనెల 17న గంభీరావుపేట మండలకేంద్రంలోని షాదీఖానాలో ఉదయం 10.30 గంటలకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఎల్లారెడ్డిపేట సెస్ ఏఈఈ పృథ్వీధర్‌గౌడ్ సోమవారం తెలిపారు. గంభీరావుపేట సబ్ డివిజన్ పరిధిలో ఉన్న ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట మండలాలకు చెందిన వినియోగదారులు హాజరై విద్యుత్ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు.

• విద్యార్థులకు దుస్తులు పంపిణీ

తంగళ్లపల్లి: మండలంలోని జిల్లెల్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోటీల్లో జట్టుగా గుర్తించేలా దుస్తులను సోమవారం పంపిణీ చేశారు. హెచ్ఎం అనురాధ మాట్లాడుతూ... పాఠశాలలోని 162 మంది విద్యార్థులకు దుస్తులను పబ్బతి రత్నమ్మ–లక్ష్మారెడ్డి జ్ఞాపకార్థం, పలువురు పూర్వ విద్యార్థులు అందించారన్నారు. బండి లక్ష్మీ, కారంగుల కిషన్ రావు, ఉపాధ్యాయులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

• గుడుంబా విక్రయిస్తే చర్యలు

వీర్నపల్లి: గర్జనపల్లి, మద్దిమల్లలో ఎస్సై లక్ష్మణ్ ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. గర్జనపల్లిలో రాములు, శంకర్ ఇళ్లలో 5 లీటర్ల గుడుంబా, ముడి సరుకులు, బెల్లం పానకం స్వాధీనం చేసుకున్నారు. మద్దిమల్ల తండాలో మంజుల, సుజాత ఇళ్లలో దాడులు చేసి బెల్లం పానకాన్ని ధ్వంసంచేసి కేసులు నమోదు చేశామన్నారు.

అర్హులకు పింఛన్ అందించాలి



కోనరావుపేటలో మాట్లాడుతున్న నాయకులు



తంగళ్లపల్లి: వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కోనరావుపేట: అర్హులైన వృద్ధులు, వికలాంగులకు, నేత, గీత, బీడీ కార్మికులకు పింఛన్ అందించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల భిక్షపతి డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే వికలాంగులకు రూ.4వేల నుంచి రూ. 6వేలు, చేయూత పెన్షన్ దారులకు రూ. 2వేల నుంచి రూ.4వేలు ఇస్తామని హామీ ఇచ్చినా ఇప్పటికీ పెన్షన్ పెంచలేదన్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొమ్ము రాజశేఖర్ మాదిగ, వీహెచ్‌పీఎస్ నాయకులు నాయక్, లింగయ్య, వికలాంగులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: వికలాంగుల పింఛన్ రూ.6వేలకు పెంచాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు వికలాంగులు ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ సుజాతకు వినతిపత్రం అందజేశారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గోపి, రామస్వామి, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: దివ్యాంగులకు ఇస్తున్న పెన్షన్‌ను పెంచాలని కోరుతూ తహసీల్దార్ జయంత్‌కుమార్‌కు వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. దివ్యాంగులకు రూ.6 వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేత, గీత, బీడీ కార్మికులకు రూ.4 వేలు, పూర్తిస్థాయి అంగవైకల్యం కలిగిన వారికి రూ.15 వేలు పెన్షన్ పెంచాలని కోరారు. మండల అధ్యక్షుడు సావనపల్లి బాలయ్య, మండల కన్వీనర్ మునిగె శంకర్, కురుమ రాజయ్య, రవి, తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: చేయూత పింఛన్లను పెంచాలని కోరుతూ మండల ఎమ్మార్పీఎస్ నాయకులు తహసీల్దార్ మారుతిరెడ్డికి వినతి పత్రం అందించారు. చేయూత లబ్ధిదారులతో ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి వినతిపత్రం అందించారు.

ఇల్లంతకుంట: వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు తహసీల్దార్ ఎంఏ ఫారుక్‌కు వినతిపత్రం అందజేశారు. వికలాంగుల నాయకులు కే లక్ష్మారెడ్డి, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులు, బీడీ కార్మికుల పింఛన్లను పెంచాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొమ్మెట రాజు కోరారు. ముస్తాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ముట్టడి చేపట్టారు. తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. శోభరాణి, బాలనర్స్, పోచయ్య, తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలంకేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గద్దరాశి భగవంతం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి తహసీల్దార్ ముక్తార్ పాషాకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు భగవంతం ,జిల్లా వికలాంగుల నాయకులు గోగురి రమేశ్, నాయకులు లక్ష్మణ్, రవి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు

రుద్రంగి: మండల ఎమ్మార్పీఎస్, వికలాంగుల సంఘం నాయకులు తహసీల్దార్ పుష్పలతకు వినతిపత్రం అందజేశారు. మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు దయ్యాల నారాయణ, వికలాంగుల సంఘం నాయకులు, తదితరులున్నారు.

ఘనంగా ఇంజినీర్స్ డే



వేములవాడ: ఆలయ ఇంజినీర్లను సత్కరిస్తున్న ఈవో రమాదేవి, ఉద్యోగ సంఘం నాయకులు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం శ్రీ రాజరాజేశ్వర స్వామి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ఇంజినీర్స్ డే ను నిర్వహించారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రాజగోపాల్ మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య విశిష్ట సేవలను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రవీందర్, శంకరయ్య, విష్ణు కుమార్, శరణ్య, అరుంధతి, విద్యార్థులు తదితరులు ఉన్నారు. పాలిటెక్నిక్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ రాజగోపాల్‌కు ఇటీవల గురుపూజోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు రావడంతో ఆయనను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

భాగ్యనగర్ ప్రభాకర్ స్మారక ప్రతిభ అవార్డు..

పాలిటెక్నిక్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ రాజగోపాల్ తండ్రి భాగ్యనగర్ ప్రభాకర్ రిటైర్డ్ ఎంఈవో జ్ఞాపకార్థంగా కళాశాలలో ప్రభాకర్ స్మారక ప్రతిభ అవార్డును ప్రారంభించినట్లు తెలిపారు. ఇందుకు ఆయన రూ.1,52,025ల చెక్కును కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకరాచారికి అందజేశారు.

వేములవాడ: ఇంజినీర్స్ డే సందర్భంగా ఆలయ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ఈఈ రాజేశ్, డీఈ రఘునందన్, ఏఈ రాంకిషన్‌రావు, డీ. శేఖర్, నాగరాజులతోపాటు సిబ్బందిని ఆలయ ఈవో రమాదేవి శాలువాతో సత్కరించారు. ఏఈవోలు శ్రవణ్, బీ. శ్రీనివాస్, అశోక్, జయకుమారి, తదితరులు పాల్గొన్నారు.



తంగళ్లపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ..

తంగళ్లపల్లి: ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కె.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఇంజినీర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఏఈ మహేశ్, జేఈ రాజనర్సయ్యను శాలువాతో సత్కరించారు.

ఘనంగా వైద్యుల బొడ్డెమ్మ వేడుక



బతుకమ్మలతో మహిళా వైద్యులు

సిరిసిల్ల: తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయ పండుగ.. బతుకమ్మ. తీరొక్క పూలతో తొమ్మిది రోజుల పాటు ప్రకృతితో మమేకమయ్యే పూలజాతర అతివల ఆత్మీయ కలయికకు వేదికగా నిలుస్తోంది. జిల్లాలోని పలువురు మహిళా వైద్యులు సోమవారం బొడ్డెమ్మ వేడుకలు నిర్వహించుకున్నారు. రంగు..రంగుల పూలతో బొడ్డెమ్మను పేర్చారు. సిరిసిల్ల–వేములవాడ పట్టణాల మధ్య గల పొలాల్లో ఎడ్లబండిపై ఎక్కి ఉత్సాహంగా గడిపారు. బతుకమ్మ ఆడిపాడారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఫాక్సీ అధ్యక్షురాలు డాక్టర్ పద్మలత, జిల్లా ఐఎంఏ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ లీలా శిరీష, వైద్యులు శోభారాణి, గీతావాణి, మాధవి, బాల సాహితీవేత్త డాక్టర్ కందేపి రాణీప్రసాద్, వేములవాడ డాక్టర్లు సింధూ, మాధవి, లహరి, స్నేహ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ



సైకిళ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

గంభీరావుపేట: మండలంలోని సముద్రలింగాపూర్, గోరింటాలలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ బీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొక్కు దేవేందర్ యాదవ్, మండల అధ్యక్షుడు కోడె రమేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి, నాయకులు వాజీద్ హుస్సెన్, ఎలేందర్, మల్లేశం యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలంలోని బందనకల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సోమవారం సైకిళ్లు పంపిణీ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతికుమార్ , హెచ్ఎం రాజ్‌కుమార్, బీజేపీ నాయకులు రమేశ్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి, బుచ్చెల్లి మహేశ్వరి, రాజు, శేఖర్, శ్రీకర్, మహేశ్, గాల్‌రెడ్డి, రవీందర్, శ్రీనివాస్, రాంరెడ్డి, శ్రీకాంత్, తిరుమలేశ్, తదితరులు పాల్గొన్నారు.

బైక్ మాయం

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రానికి చెందిన ఒల్లాద్రి సత్యంరెడ్డి తన బైక్‌ను ఆదివారం రాత్రి ఇంటిఎదుట నిలిపి ఉంచారు. తెల్లారి చూడగా బైక్ కనిపించ లేదు. చుట్టుపక్కల ఎంత గాలించినా ఆచూకీ దొరకలేదు. దీంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విధులు మరిచి.. గాఢ నిద్రలోకి



చందుర్తి: మండలకేంద్రంలోని రైతు వేదిక వద్ద యూరియా బస్తాల పంపిణీ వద్ద ఎలాంటి అల్లర్లు జరగకుండా చూడాల్సిన కానిస్టేబుల్ విధులు మరిచి కుర్చీలోనే గాఢ నిద్రలోకి జారుకోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. చందుర్తి సింగిల్‌విండో పరిధిలో రైతులకు యూరియా పంపిణీ చేసేందుకు రైతువేదికలో 440 బస్తాలను అధికారులు దింపుకున్నారు. క్యూలైన్‌లో రైతులు బారులుతీరడంతో కానిస్టేబుల్ కిషన్‌కు బందోబస్తు విధులు అప్పగించారు. కొంతసేపు విధుల నిర్వర్తించి, రైతు వేదికలోని కుర్చీలో గాఢ నిద్రలోకి జారుకున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

వేములవాడ అర్బన్: వేములవాడ మండలంలోని రుద్రవరంలో పేకాడుతున్న పదిమందిని అరెస్ట్ చేసినట్లు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. వారి నుంచి రూ.4వేలు, ఏడు సెల్ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.